

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 176 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 27, మే 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్






డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

# దేశంలో.. న్యాయమెక్కడ ?







రాజకీయాల్లో పెరిగిపోతున్న రాజకీయ నేరస్తులు

ప్రతి రాష్ట్రంలో పెరిగిపోతున్న అవినీతి

రాజకీయ అధిపతులు ప్రభుత్వ అధికారులు తోడుదొంగల్లా మారుతున్నారు

దేశంలోని ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారు

రాజకీయ నాయకుల జీతాలకు డోకాలేదు

రాజకీయ ఎన్నికల్లో పాల్గొనే నాయకులకు అర్హత పరీక్షలు నిర్వహించాలి

న్యాయస్థానాలను రాజకీయాల అవసరాల కోసం వాడుకుంటున్నారు

అన్యాయాలన్నీ న్యాయమైపోతున్నాయి

పేద ప్రజలను వెంటాడుతున్న రాజకీయ దరిద్రం

మేధావులను వెంటాడుతున్న రాజకీయ కక్షలు

కొత్తలో హడావుడి పాతబడ్డాక పగబట్టడం రాజకీయ లక్షణమా

ఆచార్య నాగేశ్వరరావు పై టిడిపి కుట్ర నశించాలి

మేధావులను వేధిస్తే తరిమి తరిమి కొడతాం తస్మాత్ జాగ్రత్త

డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

దేశంలో ప్రజల ప్రాథమిక హక్కుల డిమాండ్లు కాలరాయపడుతున్నాయని డాక్టర్ బరిగెల శివ ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజలకు న్యాయం చేయలేని ప్రభుత్వాలు ప్రజా సొమ్మును ఎలా ఖర్చు చేస్తారంటూ నిలదీశారు.ప్రజలకు న్యాయంగా రావాల్సిన హక్కులపై ఆంక్షలు విధించబడడం అనేది రాజకీయ కుట్రలలో భాగమేనని నిలదీశారు.దేశవ్యాప్తంగా ప్రజలకు న్యాయం జరగాలంటే ప్రతి రాష్ట్రంలో నిర్వహించబడుతున్న ఎన్నికలకు గాను శాసనసభ్యులకు పార్లమెంట్ సభ్యులకు ఎమ్మెల్సీలకు రాజ్యసభ సభ్యులకు అర్హత పరీక్ష నిర్వహించే చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు.రాజకీయాల్లో క్రిమినల్ నేర చరిత్రకారులు పెరిగిపోతుండటం వల్ల రాజకీయ విలువలు పడిపోతున్నాయని వాటిని నిలబెట్టడం కోసం ప్రతి రాజకీయ నాయకునికి విద్యార్హతలతో పాటు పదవి అర్హతకు రాత పరీక్ష పోటీలను నిర్వహించాలని దానివల్ల రాజకీయాలకు విలువ పెరిగే ఆస్కారం ఉంటుందని గుర్తు చేశారు.ప్రతి రాష్ట్రంలో రిజర్వేషన్ల గొడవలు పెరిగిపోతున్నాయని చిన్న పెద్ద తారతమ్య భేదం ఏమీ లేకుండా కులాన్ని బట్టి మతాన్ని బట్టి జాతులను బట్టి రిజర్వేషన్లను నిర్ధారించకుండా ప్రతి

- మిగతా 2లో..

## పంచాయతీ సిబ్బందికి తీపి కబురు చెప్పిన రేవంత్ సర్కారు

రాష్ట్రంలోని 50 వేల మంది పంచాయతీ సిబ్బందికి ఒకటో తారీఖునే జీతాలు

జీతాల కోసం ప్రతినెలా రూ. 50 కోట్ల ప్రత్యేక నిధుల విడుదల

గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పిస్తూ కీలక నిర్ణయం

పోస్టల్ విధానం రద్దు.. ఇకపై పెన్షన్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి జమ

అర్హులైన వారికి కొత్త పెన్షన్ల మంజూరుకు మొదటి ప్రాధాన్యత



2

## నాకు ఏపీ పోలీసుల నుంచి ఎలాంటి నోటీసులు రాలేదు: ప్రొఫెసర్ నాగేశ్వర్

తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్‌ను కలిసిన ప్రొఫెసర్ నాగేశ్వర్

నోటీసులు వచ్చినట్టు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై క్లారిటీ

వివాదాస్పద వ్యాఖ్యలను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు వెల్లడి

సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న దుష్ప్రచారంపై చర్యలు కోరిన నాగేశ్వర్



5

## కాంగ్రెస్ నేతలపై వ్యాఖ్యలు..

5

తెలంగాణ ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ పై వేటు

పెట్రోల్ ధరల పెంపుపై కాంగ్రెస్ నిరసనపై వ్యాఖ్యలు చేసిన డ్రైవర్

## మాజీ సీజేఐ బీఆర్ గవాయిని మర్యాదపూర్వకంగా కలిసిన మంద కృష్ణ మాదిగ



5



## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సమిష్టి కృషి అవసరం

సీఎంఓ అధికారులను కలిసి వినతిపత్రం అందజేసిన జై భీమ్ సంస్థల ప్రతినిధులు

యువతలో పెరుగుతున్న డ్రగ్స్, గంజాయి వ్యసనాలపై ఆందోళన

పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలకు సూచన

కౌన్సెలింగ్, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో యువతకు దిశానిర్దేశం

డ్రగ్స్ నిర్మూలనలో ప్రభుత్వం - ప్రజా సంఘాలు కలిసి పనిచేయాలని విజ్ఞప్తి

2

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# కొత్త పెన్షన్లపై గందరగోళం

**ఎండలో వృద్ధులు,వితంతువులు, దివ్యాంగుల అవస్థలు**
**మండల మాజీ వైస్ ఎంపిపి మల్లేషం**



**వికారాబాద్, జై భీమ్ న్యూస్**

కొత్త పింఛన్ల దరఖాస్తుల విషయంలో గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనీ మండల మాజీ వైస్ ఎంపిపి మల్లేషం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా... గ్రామాల్లో అవసరమైన సర్టిఫికెట్ల కోసం మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతూ గందరగోళానికి గురవుతున్నారన్నారు. గ్రావిమాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నూతన పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలా ? వద్ద అనే విషయంలో అధికారులు స్పందించకపోవడం శోచనీయం అని,ఎన్నికల ముందు అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాలు దాటిన ఇంతవరకు వితంతువులకు, వికలాంగులకు, వృద్ధులకు కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు.ఎన్నికల్లో కుటుంబంలో బార్య భర్తలకు ఇద్దరికి ఇస్తామని చెప్పారు. రెండున్నర సంవత్సరాలు దాటిన ఇప్పటివరకు కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు.అమలు గాని హామీలకే తప్ప ఈ ప్రభుత్వం ఆచరణలో చేయడం లేదు.మే 22 నుంచి 25, 30 వరకు' దరఖాస్తులు స్వీక రిస్తారంటూ తేదీలతో కూడిన పోస్టర్లు వాట్సాప్ గ్రూపుల్లో విపరీతంగా వైరల్ అయ్యాయి. ప్రచారాన్ని నమ్మి వృద్ధులు,దివ్యాంగులు మీ సేవ,జిరాక్స్ సెంటర్ల చుట్టూ,ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.అవసరమైన సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు.

# డ్రగ్స్ నిర్మూలనకు సమన్వయంతో కఠిన చర్యలు అవసరం : డీఆర్వో కె. శ్రీనివాస్



**హన్మకొండ, 26 మే 2026(జై భీమ్ న్యూస్)**

సమాజానికి మహమ్మారిగా మారుతున్న మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారి కె. శ్రీనివాస్ అన్నారు. డ్రగ్స్ నియంత్రణ కోసం అన్ని శాఖలు సమన్వయంతో కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డ్రగ్స్ నిర్మూలనపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు మాదకద్రవ్యాలు మరియు ఇతర మత్తు పదార్థాల నియంత్రణ కోసం చేపడుతున్న చర్యలను వివరించారు. సమావేశంలో డీఆర్వో కె. శ్రీనివాస్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగత జీవితాలు, కుటుంబాలు తీవ్రంగా దెబ్బతింటాయని అన్నారు. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి, మత్తు పదార్థాల దుష్ప్రభావాలను వివరించాలని సూచించారు. సమాజంలో మత్తు పదార్థాల వ్యాప్తిని అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో "ప్రహరి క్లబ్బులు" ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రమేష్ రాథోడ్, పరకాల ఆర్డీవో వెంకన్న, జిల్లా శిశు సంక్షేమ అధికారి విశ్వజ, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, హనుమకొండ, కాజీపేట, పరకాల ఏసీపీలు నరసింహారావు, ప్రశాంత్ రెడ్డి, సతీష్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అదనపు డీఎంహెచ్ఓ మదన్మోహన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# పంచాయతీ సిబ్బందికి తీపి కబురు చెప్పిన రేవంత్ సర్కారు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించింది. సుమారు 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తారీఖునే జీతాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు సమయానికి జీతాలు అందినట్లే, క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ సిబ్బందికీ వేతనాలు అందాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాల చెల్లింపులో జాప్యం జరగకుండా, ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.50 కోట్లను ప్రత్యేకంగా విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కేవలం పంచాయతీ సిబ్బందికే కాకుండా, ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ నెల మొదటి రోజే జీతాలు అందేలా చూడాలని తేల్చిచెప్పారు. సిబ్బంది జీతాల చెల్లింపులో ఒక్కరోజు ఆలస్యమైనా సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో జమ చేయాలన్న నిబంధనను రద్దు చేయాలని ఆదేశించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 70(3)కి సవరణలు చేసి, పంచాయతీల సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీకి బదులుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది పంచాయతీల ఆర్థిక స్వేచ్ఛను పునరుద్ధరించడానికి దోహదపడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. పెన్షన్ల పంపిణీ విధానంలోనూ మార్పులు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న పెన్షన్లను ఇకపై నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని చెప్పారు. ఈ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, అనర్హులను ఏరివేయడం సులభమవుతుందని తెలిపారు. ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్, సామాజిక-ఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ) డేటాను ఉపయోగించి పెన్షన్ల క్రమబద్ధీకరణ చేపట్టాలన్నారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సమిష్టి కృషి అవసరం

**సీఎంఓ అధికారులను కలిసి వినతి పత్రం అందజేసిన జై భీమ్ సంస్థల చైర్మన్ బరిగెల శివతో పాటు సామాజిక కార్యకర్తలు**

**హైద్రాబాద్, మే 26 (జై భీమ్ న్యూస్)**

యువతను డ్రగ్స్, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరుతూ జై భీమ్ సంస్థల చైర్మన్ డాక్టర్ బరిగెల శివతో పాటు పలువురు సామాజిక కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యాలయం (సీఎంఓ) అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఎంఓ ఓఎస్డీ వేముల శ్రీనివాస్, సీఎం సీపీఆర్వో మల్సూర్‌లను మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రంలో యువతలో పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం వల్ల కలుగుతున్న దుష్పరిణామాలు, సమాజంపై పడుతున్న ప్రతికూల ప్రభావం, విద్యార్థుల్లో పెరుగుతున్న వ్యసనాల పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని, కుటుంబ వ్యవస్థలను దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థి దశలోనే యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని, దీనివల్ల చదువులు, ఆరోగ్యం, మానసిక స్థితి తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రభుత్వం ఇప్పటికే తీసుకుంటున్న చర్యలను మరింత బలోపేతం చేయాలని, కేవలం చట్టపరమైన చర్యలతో పాటు ప్రజల్లో చైతన్యం కల్పించే కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ప్రత్యేక అవగాహన సదస్సులు, ర్యాలీలు, కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు డ్రగ్స్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. యువతలో నైతిక విలువలు పెంపొందించే కార్యక్రమాలతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా వారిని సానుకూల దిశగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బరిగెల శివ, ఎస్ఎస్ రాజు పాల్గొని డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రభుత్వం, ప్రజా సంఘాలు, విద్యాసంస్థలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరాన్ని అధికారులకు వివరించారు. రాష్ట్ర భవిష్యత్తు అయిన యువతను మత్తు పదార్థాల బారినుంచి కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని వారు పేర్కొన్నారు.



# దేశంలో న్యాయమెక్కడ


కుటుంబంలో ఆదయ లెక్కల ఆధారంగా ఆస్తుల లెక్కల ఆధారంగా పరిగణలోకి తీసుకొని రిజర్వేషన్లను నిర్ధారించాలని సూచించారు.రిజర్వేషన్ల జాబితాను కేవలం కులాలకు నిమ్నస్థాయి వర్గాలకు మాత్రమే అంటగడుతూ సంపన్న వర్గాలు అగ్రవర్ణాలు ఈడబ్ల్యూఎస్ కోటా కింద రిజర్వేషన్లను అనుభవిస్తూ గ్రూప్ 1 యూపీఎస్సీ లాంటి పెద్ద ఉద్యోగాలను పొందుకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు. ఆదాయాన్ని బట్టి రిజర్వేషన్ నిర్ధారించబడితే పేదరికంలో ఉన్న వ్యక్తులకు రిజర్వేషన్లు కల్పించబడతాయని వాటి వల్ల ఆదాయ సంపన్నులతో సమజ్జీవులుగా ఎదిగే అవకాశాలు పేద ప్రజలకు కల్పించబడతాయని గుర్తు చేశారు.దేశంలో న్యాయం కోరవడుతుందని సంపన్నులకు ఒకరకంగా పేద వాళ్లకు ఒక రకంగా న్యాయం జరుగుతుందని తీవ్రంగా మందలించారు.న్యాయం కోసం ఆరటపడే పేదవాళ్లు న్యాయస్థానాలను ఆశ్రయించలేకపోతున్నారని ప్రతి రాష్ట్రంలో పేదవాళ్ల కోసం ఎలాంటి ఫీజులు చెల్లించబడకుండా ఫ్రీగా కేసులు వాదించబడె విధంగా న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాలని అందులో కేవలం న్యాయస్థానాలను ఆశ్రయించడానికి డబ్బులు లేని పేదవాళ్లకు మాత్రమే న్యాయం జరిగించబడే విధంగా ఆంక్షలు విధిస్తూ ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా రాజకీయాల్లో ప్రభుత్వ అధికారుల్లో లెక్కలేనంతమంది తప్పులకు పాల్పడుతున్నారని లెక్కలేనంత మంది క్రిమినల్ నేరస్తులకు సంబంధించిన కేసులు అనుభవిస్తున్నారని లెక్కలేనంత మంది అక్రమంగా ఆస్తులు సంపాదిస్తున్నారని లెక్కలేనంతమంది అధికార దుర్వినియోగాలకు పాల్పడుతున్నారని తీవ్రంగా విమర్శిస్తూ చట్టం ముందు గాని న్యాయస్థానం ముందుగానే తప్పు చేసినట్లు రుజువైన రాజకీయ నాయకులను గాని ప్రభుత్వ ఉద్యోగులను గాని వాళ్ల వాళ్ల పదవులలో నుండి వెంటనే తొలగిస్తూ రాజకీయాల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో కొనసాగకుండా శాశ్వతంగా నిషేధించబడే విధంగా కొత్త చట్టాన్ని రూపొందించాలని వివరించారు.దేశంలో ప్రజల మనోభావాలు దెబ్బ తినడానికి ప్రధానంగా రాజకీయ అవగాహన లేని నాయకులు ప్రభుత్వ అధికారాల్లో క్రియాశీలకమైన పదవుల్లో కొనసాగుతుండడం వల్ల రాజకీయ పరిపక్వత తగ్గిపోయి పేద ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన కల్పించబడటం లేదని తీవ్రంగా మందలించారు.రాజకీయాలు అన్నాక తప్పులకు పాల్పడడం సర్వసాధారణమని భావిస్తున్న ప్రతి రాజకీయ నాయకునికి తప్పు చేస్తే పదవి పోతుందనే గుణపాఠం జరిగే విధంగా యావత్ భారత దేశంలో రాజకీయ తప్పులకు పాల్పడుతున్న వ్యక్తులను తక్షణం పదవుల్లో నుండి తొలగించే చట్టాలను రూపొందించి కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ అధికారులు ప్రతి కార్యాలయాన్ని కేవలం అధికార దోపిడీకి అధికార దుర్వినియోగాలకు అక్రమ కార్యక్రమాలకు అవినీతి సంపాదనకు మాత్రమే ఉపయోగించుకుంటున్నారని వ్యవస్థల బాగోగుల కోసం పని చేయాలనే ఆలోచన గానీ స్వభావం గానీ 80 శాతం మంది ఉద్యోగుల్లో అధికారుల్లో తగ్గిపోతుందని వాటివల్ల దేశంలో పేద ప్రజలకు ఏమాత్రం న్యాయం జరిగే ఆస్కారం లేకుండా పోతుందని ప్రభుత్వ వ్యవస్థలు పతనం కావడానికి ఇలాంటి అధికారులు ప్రధాన కారకులుగా మిగిలిపోతుండగా వారని పెంచి పోషిస్తున్న అధికార ప్రభుత్వాలు సిగ్గుతో తలదించుకునే పరిస్థితిలో తలెత్తుతూనే ఉన్నాయని తీవ్రంగా విమర్శించారు.దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో ఆయా ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వ నిధులను ప్రతి రాష్ట్రంలోని ప్రజలందరికీ నవా పైసతో సహా లెక్కలు చూపించాలని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వమైతే ప్రజల సొమ్మును ఖర్చు చేస్తూ ప్రజలకు లెక్కలు చెప్పకుండా చాటు ముఖం వేస్తుందో ఆ ప్రభుత్వం తీవ్రమైన తప్పులకు పాల్పడుతుందని ఆయా రాష్ట్రాల ప్రజలు నిర్ధారించుకోవాల్సిన అవసరం తప్పకుండా ఉంటుందని గుర్తు చేశారు.ప్రభుత్వాలు చేస్తున్న ఖర్చులలో స్పష్టత ఉన్నప్పుడు ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న ఖర్చులు లెక్కలను చెప్పడానికి భయమెందుకు అంటూ జనుకెందుకంటూ నిలదీశారు.ప్రతి రాజకీయ నాయకునికి పదవులపై ఉన్న శ్రద్ధ పదవులపై ఉన్న ఆసక్తి ప్రజాసేవపై ఉండకపోవడం రాజకీయ దుర్వినియోగమే అంటూ తీవ్రంగా విమర్శించారు.దేశంలో న్యాయం ఎక్కడ అంటూ 120 కోట్ల మంది ప్రజలు రోడ్లపైకి వస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు అంటే దానికి కేంద్ర ప్రభుత్వం తప్పకుండా బాధ్యత వహించాల్సి ఉంటుందని , అదే సందర్భంలో మూల్యం చెల్లించక తప్పదు అంటూ సూటిగా నిలదీశారు.

### మేధావులు అణిచివేత మెదడు తక్కువ పని..

ఒకవైపు దేశంలో ప్రజలకు న్యాయం జరగడం లేదంటూ మేధావులు గలమెత్తుతున్న వేల పేద ప్రజల పక్షాన మేధావులు నిలబడుతున్నారనే కక్షతో మేధావులు మాట్లాడుతున్న మాటలను ప్రభుత్వాలపై ప్రశ్నిస్తున్న తీరులను తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వాలు మేధావులపై కేసులు కడుతున్నారని హెచ్చరించారు.ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించే హక్కు రాజకీయంలో భాగమేనని రాజకీయ పదవుల్లో ఉన్న నాయకులకు వ్యక్తిగతం అంటూ ,వ్యక్తిగత స్వేచ్ఛ అంటూ ఏమీ ఉండవని ప్రజాసేవలో భాగమై ఉన్నంతకాలం అధికార పదవుల్లో కొనసాగుతున్నంతకాలం ఎలాంటి విమర్శలునైనా ఎలాంటి సద్దూషనులైన భరించాల్సిందే నంటూ గుర్తు చేశారు.ప్రజాస్వామ్యబద్ధంగా రాజకీయాలు సరైన మార్గంలో నడిపించబడడానికి మేధావులు పలు విధాలుగా విశ్లేషించే హక్కు ఉంటుందని రాజకీయ విశ్లేషకుల ఆలోచనలకు అనుగుణంగా మేధావులు రాజకీయాలను ప్రజలకు అనుగుణంగా మలచబడే విధంగా ప్రభావితమైన అంశాలతో ప్రజలను మేల్కొల్పుతుండగా వాటిని ఏమాత్రం గిట్టని నాయకులు మేధావులపై కేసులు కట్టడం సిగ్గుకరమన్నారు.దేశంలో ప్రజలకు న్యాయం జరగాలంటే మేధావుల హక్కులు రక్షింపబడాలని జర్నలిస్టుల హక్కులు పరిరక్షించబడాలని పిలుపునిచ్చారు.మేధావి వర్గానికి జర్నలిజం వర్గం 100 శాతం అండగా నిలుస్తుందని మేధావులను కాపాడుకునే బాధ్యత జర్నలిస్టులు తీసుకుంటారని రాజకీయ నాయకులు గుర్తించాలన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన విశ్రాంత ఆచార్యులు ఆచార్య నాగేశ్వరరావు పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహా కూటమి లోని భాగమైన టిడిపి ప్రభుత్వం వేధింపులకు గురి చేయడం దేశంలో ప్రతిభావంతమైన మేధావిని వృద్ధాప్యంలో ఇబ్బందులు పెడుతూ అది కూడా స్థానికేతర ప్రాంతంలోనికి వాళ్ల ప్రభుత్వానికి చెందిన పోలీసులను పంపించి వేధిస్తుండడం ఎంతటి సిగ్గుమాలినతనమో టిడిపి పార్టీకి తెలంగాణ రాష్ట్ర మేధావులే కాకుండా దేశంలోని మేధావులు అంతా మేధావులు చుక్కలు చూపించాలని కోరారు. అంత పెద్ద మేధావికే న్యాయం జరగకపోతే సామాన్యులకు న్యాయం చేస్తున్నామని సామాన్యులకు సేవ చేస్తున్నామని రాజకీయ పార్టీలు మాట్లాడడం సిగ్గు కరంగా ఉందన్నారు.ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆచార్య నాగేశ్వరరావు పై ఎలాంటి చర్యలకు పాల్పడద్దని బహిరంగంగా చెప్పడం జరిగినప్పటికీ దానితోపాటు ఆంధ్రప్రదేశ్ బిజెపి పార్టీ ఆచార్య నాగేశ్వరరావు పై ఎలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పలకూడదని పూర్తి సంఘీభావం తెలిపినప్పటికిని టిడిపి పార్టీ మాత్రం మొద్దుబారినతనాన్ని ప్రదర్శిస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని తెలంగాణ మేధావులను అభాసుపాలు చేయడం కోసం కక్షగడుతున్నారని తెలంగాణ మేధావులు తెలంగాణ ప్రజలు తీవ్రంగా ఖండించాల్సిన సమయం ఏర్పడిందన్నారు.

### తోడుదొంగలతో న్యాయం జరగదు..

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటి జనరేషన్ ఉద్యోగులు దేశాన్ని ఉన్నత స్థాయిలో ప్రభావితం చేయగలిగారని అదేవిధంగా రెండవ స్థాయి జనరేషన్ ఉద్యోగులు, భారతదేశానికి అండగా నిలిచి ఎమర్జెన్సీ కాలంలో దేశాన్ని దేశ విలువలను దేశ భద్రతను కాపాడుకోగలిగినారని దానివల్లనే దేశ ఆర్థిక వనరులు కాపాడబడుతూ రక్షించబడుతూ భారతదేశం రక్షణ వలయంలో నిలిచిందని గర్వంగా చెప్పగలమన్నారు.ప్రస్తుత జనరేషన్ లోని రాజకీయ నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను, ప్రభుత్వ అధికారులను చెప్పు చేతుల్లో పెట్టుకొని విపరీతమైన అవినీతిని ప్రోత్సహిస్తూ, ప్రేరేపిస్తూ దేశ రాజకీయాలను దేశ ఆర్థిక విలువలను దేశంలో ప్రజలకు జరగాల్సిన న్యాయాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు.ప్రతి రాష్ట్రంలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ రాజకీయ అధిపతుల చెప్పుచేతుల్లో పెట్టుకున్నాక ఆయా రాజకీయ నాయకులకు అనుగుణమైన ఉద్యోగులను, అధికారులను ఉన్నత స్థానాలకు బదిలీలు చేయించుకుంటూ ప్రతి ప్రభుత్వ కార్యాలయాన్ని పెద్ద ఎత్తున అవినీతి జరుపబడేవిధంగా శ్రీకారం చుడుతున్నారని దానికి అంతటికి రాజకీయ నాయకులు ప్రభుత్వ ఉద్యోగులు ఒకరికి ఒకరు తోడుదొంగలాగా తయారై దేశాన్ని దోచుకుంటున్నారని దానివల్ల దేశంలోని న్యాయస్థానం కూడా దేశంలో జరుగుతున్న అవినీతి నుండి దేశాన్ని కాపాడలేకపోతుందని దేశ ప్రజలకు న్యాయం చేయాలనే ఉద్దేశంలో న్యాయస్థానాలు కూడా ప్రస్తుత జనరేషన్ లోని రాజకీయ ఉద్యోగుల రాజకీయ అధిపతుల ప్రభుత్వ అధికారుల అవినీతి అక్రమాలకు అండగా నిలుస్తున్నట్లుగా దేశ ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు.అధికార పదవులకు కీలుబొమ్మలుగా అతుక్కుపోయే అవినీతిపరులు ఉన్నంతకాలం రాజకీయ నాయకుల ఆగడాలు కొనసాగుతూనే ఉంటాయని ఉద్యోగులను కీలుబొమ్మలుగా చేసుకొని అవినీతిని కొనసాగిస్తున్న రాజకీయ వర్గం ఉన్నపాటుగా నశించిపోవాలని తీవ్రంగా విమర్శించారు.అన్నిటికన్నా ప్రధానంగా అవినీతి అధికారులను పెంచి పోషిస్తున్నది రాజకీయ నాయకులేనని దుయ్యపడ్డారు.అధికారులు తప్పులకు పాల్పడడం రాజకీయ అధిపతులు వాళ్ళని వెనుకేసుకు రావడం ఒక రకంగా ప్రస్తావించాల్సి వస్తే దేశంలోని ప్రతి రాష్ట్రంలో అవినీతి అధికారులతో చలామణి అయ్యే ప్రభుత్వ కార్యాలయాలు ఎక్కువగా పెరిగిపోతున్నాయని వాటిని పెంచి పోషిస్తూ వాటిని అభివృద్ధి పరుస్తున్న రాజకీయ నాయకులు ప్రభుత్వ కార్యాలయాలను గుప్పిట్లో పెట్టుకోవడం కోసం అవినీతి సామ్రాజ్యాన్ని స్థాపిస్తున్నారని వీటన్నిటి వల్ల దేశంలో న్యాయం అనేది లేకుండా పోతుందనేది కోట్లాదిమంది ప్రజలు బలంగా నమ్ముతున్నారని చెప్పారు.



# 4 కిలోల అరుదైన కణతిని విజయవంతంగా తొలగించిన శస్త్రవైద్య నిపుణులు డాక్టర్ జె. సోమశేఖర్





### పేదల పాలిట ఆపద్బాంధవుడిగా నిలుస్తున్న హసన్‌పర్తి శివ రచన హాస్పిటల్

**హసన్‌పర్తి, 26 మే 2026 (జై భీమ్ న్యూస్)**

హన్మకొండ జిల్లా కేంద్రానికి సమీపంలోని హసన్‌పర్తి మండల కేంద్రంలో ఉన్న శివ రచన హాస్పిటల్ మరోసారి అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి ప్రజల ప్రశంసలు అందుకుంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ పేదల పాలిట ఆపద్బాంధవుడిగా పేరుగాంచిన ప్రముఖ శస్త్రవైద్య నిపుణులు డాక్టర్ జె. సోమశేఖర్ తన వైద్య నైపుణ్యాన్ని మరోసారి చాటిచెప్పారు. సుమారు 4 కిలోల బరువున్న అరుదైన భారీ కణతిని మహిళ కడుపు నుండి విజయవంతంగా తొలగించి రోగికి పునర్జన్మ ఇచ్చినట్లు స్థానికులు కొనియాడుతున్నారు. ఆసుపత్రి వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా వెంకటాపూర్‌కు చెందిన మున్ని ఖాటూన్ (42), భర్త పర్వేజ్ ఖాన్, గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పి, శరీర అస్వస్థత, నడవడంలో ఇబ్బందులు వంటి సమస్యలతో బాధపడుతున్నారు. పలు ప్రాంతాల్లో వైద్యం చేయించుకున్నప్పటికీ ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో హసన్‌పర్తిలోని శివ రచన హాస్పిటల్‌ను సంప్రదించారు. రోగిని పరీక్షించిన డాక్టర్ జె. సోమశేఖర్ వెంటనే స్కానింగ్‌తో పాటు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో మహిళ కడుపులో భారీ పరిమాణంలో ప్రమాదకర కణతి ఉన్నట్లు గుర్తించారు. కణతి పరిమాణం అధికంగా ఉండటంతో పాటు రోగి ఆరోగ్య పరిస్థితి కూడా క్లిష్టంగా ఉండటంతో వైద్య బృందం అత్యంత అప్రమత్తంగా వ్యవహరించింది. రోగి ప్రాణాలకు ఎలాంటి ముప్పు లేకుండా శస్త్రచికిత్స నిర్వహించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. అనంతరం డాక్టర్ జె. సోమశేఖర్ నేతృత్వంలో అనస్తీషియా నిపుణుడు డాక్టర్ రమేష్, వైద్య సిబ్బంది వినయ్, తరుణ్, టెక్నీషియన్ అశోక్ సమన్వయంతో పలు గంటల పాటు అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 4 కిలోల బరువున్న అరుదైన కణతిని విజయవంతంగా తొలగించి వైద్య బృందం మరోసారి తమ ప్రతిభను నిరూపించుకుంది. ప్రస్తుతం మహిళ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నట్లు ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో శివ రచన హాస్పిటల్ విశేష కృషి చేస్తోందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందించడంలో డాక్టర్ జె. సోమశేఖర్ ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా రోగులకు అండగా నిలుస్తూ మానవత్వంతో వైద్యం అందించడం వల్లే ఆయనకు ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు లభించిందని తెలిపారు. ఈ విజయవంతమైన శస్త్రచికిత్స అనంతరం రోగి కుటుంబ సభ్యులు వైద్య బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మహిళ ప్రాణాలను కాపాడిన డాక్టర్ సోమశేఖర్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని భావోద్వేగంతో పేర్కొన్నారు. స్థానిక ప్రజలు, రోగుల కుటుంబ సభ్యులు ఆసుపత్రి సిబ్బందిని అభినందిస్తూ డాక్టర్ సోమశేఖర్ సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా డాక్టర్ జె. సోమశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు కడుపు నొప్పి, అసాధారణ వాపులు, శరీరంలో మార్పులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ప్రాణాపాయం కలిగే అవకాశాలు ఉంటాయని హెచ్చరించారు. ఆధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందంతో శివ రచన హాస్పిటల్‌లో అన్ని రకాల శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం తమ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామని డాక్టర్ సోమశేఖర్ స్పష్టం చేశారు. అలాగే ఈ శస్త్రచికిత్స విజయవంతం కావడానికి సహకరించిన వైద్య బృందం, ఆసుపత్రి సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

# కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు మారాలి






### వృత్తి నైపుణ్యంపై ప్రత్యేక శిక్షణ అవసరం
### మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి
### యూనియన్‌పై సభ్యులకు నమ్మకం కలిగించాలి
### టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

**హైద్రాబాద్, 26 మే 2026 (జై భీమ్ న్యూస్)**

మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని వృత్తి నైపుణ్యాన్ని మరింత మెరుగుపరచుకోవాలని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ మీడియా అకాడమీ భవనంలో హనుమకొండ జిల్లా నూతన టీయూడబ్ల్యూజే కమిటీ ప్రతినిధులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, కార్యదర్శి ఊటుకూరు సాయిరాం, కోశాధికారి విష్ణువర్ధన్‌లు మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిని శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందించిన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిజం రంగంలో సాంకేతిక మార్పులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో మీడియా ప్రతినిధులు ఆధునిక టెక్నాలజీ, డిజిటల్ మీడియా, కృత్రిమ మేధస్సు (ఏఐ) వినియోగంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హనుమకొండ జిల్లా కమిటీ ప్రతిపాదన మేరకు జిల్లాలో ఏఐ వినియోగంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే హైదరాబాద్‌లో జర్నలిస్టుల కోసం రెండు రోజులపాటు ప్రత్యేక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణ కార్యక్రమాల్లో ఆసక్తి గల జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనేలా యూనియన్ కృషి చేయాలని సూచించారు. అనంతరం టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీని జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా నాయకులను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. యూనియన్‌పై ప్రతి సభ్యుడికి నమ్మకం కలిగే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. క్రమశిక్షణతో పని చేస్తూ సంఘం పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో నిర్వహించనున్న సెమినార్లు, అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలను హనుమకొండ జిల్లా యూనిట్‌తో పాటు గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించి విజయవంతం చేయాలని సూచించారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా సంఘం కృషి చేస్తుందని, సమస్యలు ఉంటే రాష్ట్ర నాయకత్వానికి నివేదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బోల్లారపు సదయ్య, కోశాధికారి అమర్, రాష్ట్ర నాయకులు గాడిపెల్లి మధు, కంకణాల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు పంపిణీ చేయాలి

### లేదంటే జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు తప్పవు : న్యాయవాది కొత్తూరి రమేష్

**హుజురాబాద్, 26 మే 2026 (జై భీమ్ న్యూస్)**

హుజురాబాద్‌లో నిర్మించి సంవత్సరాలుగా పంపిణీ చేయకుండా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను వెంటనే అర్హులైన పేదలకు కేటాయించాలని సేవ్ ఇండియన్ కాన్స్టిట్యూషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, న్యాయవాది కొత్తూరి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హుజురాబాద్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో)ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పేదలకు గృహ వసతి కల్పించాలనే సంకల్పంతో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. అయితే దాదాపు పదేళ్ల క్రితం నిర్మించిన ఈ ఇండ్లు ఇప్పటికీ పంపిణీ చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా కూడా ఇండ్ల పంపిణీ జరగకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అర్హులైన ఇండ్లు లేని పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇళ్ల పంపిణీలో ముఖ్యంగా వితంతువులు, వికలాంగులకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. జూన్ 2 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాటికి ఇండ్ల పంపిణీ చేపట్టకపోతే అర్హులైన లబ్ధిదారులతో కలిసి జేఏసీ ఏర్పాటు చేసి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను స్వాధీనం



చేసుకునే ఉద్యమానికీ వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కాసుగోని కిరణ్ కుమార్, సుమన్, రమేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరుపల్లిలో నూతన అంగన్వాడీ భవనం ప్రారంభం

### గ్రామీణ చిన్నారుల విద్య, పోషణకు ప్రభుత్వం పెద్దపీట





**వరంగల్ జిల్లా/సంగెం, 26 మే 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల రెండవ రోజు సందర్భంగా సంగెం మండలం గుంటూరుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఆధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ భవనం గ్రామీణ ప్రాంత మహిళలు, చిన్నారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఉపయోగపడనుంది. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.8 లక్షలు, సీడీపీఓ ఆధ్వర్యంలోని 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.4 లక్షల వ్యయంతో మొత్తం రూ.12 లక్షలతో ఈ అంగన్వాడీ భవనాన్ని నిర్మించారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల ప్రాథమిక విద్య, ఆరోగ్యం, పోషకాహారం అందించడంలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్త అంగన్వాడీ భవనం ద్వారా గ్రామ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్య విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వరంగల్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన "స్నేహ" కార్యక్రమం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలవుతుండడం ఆనందంగా ఉందన్నారు. మహిళలు, కౌమార దశలో ఉన్న బాలికల సంక్షేమానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా మారిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, బాలికలకు అవసరమైన సేవలను ఒకే వేదికపై అందించడమే "స్నేహ" కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత చిన్నారులకు మెరుగైన పోషణ, ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యా వ్యవస్థ బలోపేతంతో పాటు చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించి ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ విజయలక్ష్మి, డిడబ్ల్యూఓ రాజమణి, ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, ఎంపీడీవో రమేష్, గుంటూరుపల్లి సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

# బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన సదస్సు

### ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి
### జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమలత

**ములుగు, 26 మే 2026 (జై భీమ్ న్యూస్)**



మహిళాభివృద్ధి మరియు శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమలత తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. జిల్లాలోని ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్, గోవిందరావుపేట మండలాలకు చెందిన వివాహాలు నిర్వహించే పురోహితులు, ఖాజీలు, పాస్టర్లు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు, బ్యాండ్ మేళం నిర్వాహకులకు బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమం బుధవారం, మే 27న ఉదయం 11 గంటలకు ములుగు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించబడుతుందని తెలిపారు. సంబంధిత మండలాలకు చెందిన వివిధ మతాల మత పెద్దలు, వివాహాలు నిర్వహించే వ్యక్తులు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు, బ్యాండ్ మేళం నిర్వాహకులు తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బాల్య వివాహాల వల్ల కలిగే చట్టపరమైన, సామాజిక, ఆరోగ్యపరమైన ప్రభావాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవడంతో పాటు ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమలత పిలుపునిచ్చారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# పీవీ విజ్ఞాన కేంద్రం పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

జూన్ 28 నాటికి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి : కలెక్టర్ చాహత్ బాజ్ పాయి






**హన్మకొండ జిల్లా/భీమదేవరపల్లి, 26 మే 2026 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం మాజీ ప్రధానమంత్రి దివంగత పాములపర్తి వెంకట నరసింహారావు స్వగ్రామమైన వంగరలో నిర్మాణంలో ఉన్న పీవీ విజ్ఞాన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పీవీ స్ఫూర్తి వనంలోని ఫోటో గ్యాలరీ, సైన్స్ మ్యూజియం, సమావేశ మందిరాన్ని సందర్శించిన కలెక్టర్, అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని పర్యాటక శాఖ, కుడా అధికారులకు సూచించారు. ముఖ్యంగా తాగునీటి పైపులైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 28 నాటికి అన్ని పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అనంతరం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్వగృహంలో ఏర్పాటు చేస్తున్న ఫోటో మ్యూజియాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. పీవీ నరసింహారావు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా పనిచేసిన కాలంలో జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులతో దిగిన అరుదైన ఫోటోలను కుటుంబ సభ్యులతో కలిసి పరిశీలించారు. వివిధ సందర్భాల్లో దిగిన ఫోటోల ప్రాముఖ్యతను పీవీ కుటుంబ సభ్యులు పీవీ ప్రభాకర్ రావు, ఎమ్మెల్సీ సురభి వాణి దేవి, పీవీ మదన్ మోహన్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అదేవిధంగా వివిధ దేశాల నుంచి పీవీ నరసింహారావుకు లభించిన పురస్కారాలు, ఆయన రచించిన పుస్తకాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పీవీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, స్థానిక తహసీల్దార్ రాజేష్, పర్యాటక శాఖ డీఈ ధనరాజ్, ఏఈ కీర్తి తదితరులు పాల్గొన్నారు.

# హసన్‌పర్తిలో మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీ ఎన్నిక

బాలల రక్షణ కోసం సమన్వయంతో పనిచేయాలి : ఎంపీడీవో సుమనవాణి



**హసన్‌పర్తి, 26 మే 2026 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండలంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. మండల అభివృద్ధి అధికారి పి. సుమనవాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ బి. పద్మ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ శాఖల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, కోఆర్డినేటర్లు, ఎన్జీవో ప్రతినిధులు, క్షేత్రస్థాయి అధికారులతో కలిసి బాలల సంరక్షణ, రక్షణ కోసం సుమారు 20 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సుమనవాణి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, బాలల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. బాలల రక్షణ, సంరక్షణ విషయంలో మండల స్థాయిలో అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కమిటీ సభ్యులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ బాలల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. మండల స్థాయి కన్వీనర్‌గా హసన్‌పర్తి సీడీపీఓ స్వరూప బాధ్యతలు నిర్వహిస్తారని, మిగతా సభ్యులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్, డిఆర్డిఓ ఏపీఎం దాసరి నారాయణ, ఐసీడీఎస్ సూపర్వైజర్లు బి. పద్మ, ఎస్. కల్పన, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సమితి కోఆర్డినేటర్ ఈసంపల్లి సుదర్శన్, డీహెచ్ఈడబ్ల్యూ వి. స్వర్ణలత, షేర్ ఎన్జీవో ఫీల్డ్ వర్కర్ జమున, ఏపీఓ జయలక్ష్మి, జయగిరి గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు, అంగన్వాడీ టీచర్ రజని తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి ప్రభుత్వ సహకారం కోరిన వీసీ

డాక్టర్ కె. కేశవరావును మర్యాదపూర్వకంగా కలిసిన ఉపకులపతి ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి

**హైదరాబాద్ / జై భీమ్ న్యూస్ :**

కాకతీయ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే .కేశవరావు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయానికి సంబంధించిన పలు అకాడెమిక్, పరిపాలనా అంశాలపై వారు విస్తృతంగా చర్చించారు. కాకతీయ విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగుపెట్టడం, అలాగే యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయ అభివృద్ధికి అవసరమైన నూతన భవనాలు, మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరింత సహకారం అందించాలని ఉపకులపతి కోరారు. అదేవిధంగా విశ్వవిద్యాలయంలోని పీవీ నరసింహారావు విజ్ఞాన కేంద్రం కు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కూడా ఉపకులపతి విజ్ఞప్తి చేశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలపై డాక్టర్ కె. కేశవరావు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. స్వర్ణోత్సవ వేడుకలు, శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయాన్ని మరింత ఆధునిక విద్యా, పరిశోధనా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని విద్యావర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# అంబేద్కర్ విగ్రహం తరలింపుపై దళిత సంఘాల ఆగ్రహం

అర్ధరాత్రి వేళ విగ్రహం తొలగింపు ప్రజాస్వామ్యానికి మచ్చ ఎమ్మార్పీఎస్ నాయకులు

**కొత్తగూడెం / జై భీమ్ న్యూస్ :**



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని అర్ధరాత్రి వేళ భారీ క్రేన్ల సహాయంతో తొలగించి ఆర్ అండ్ బి కార్యాలయానికి తరలించడం దళిత సమాజాన్ని తీవ్రంగా అవమానించిన చర్య అని దళిత సంఘాల నాయకులు మండిపడ్డారు. అశ్వాపురం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ముందు బైఠాయించి నిరసన చేపట్టి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడి విగ్రహాన్ని ప్రజలకు తెలియకుండా రాత్రి వేళల్లో తరలించడం ప్రజాస్వామ్యానికి మచ్చతెచ్చే చర్య అని నాయకులు ఆరోపించారు. విగ్రహం తొలగింపుపై ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం, ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. “అంబేద్కర్ అంటే కేవలం ఒక నాయకుడు కాదు... కోట్లాది అణగారిన వర్గాల ఆత్మగౌరవ ప్రతీక” అని పేర్కొంటూ, విగ్రహాన్ని అవమానకరంగా తరలించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో దాసరి సాంబశివరావు (ఎమ్మార్పీఎస్ మాజీ టౌన్ ప్రెసిడెంట్, కొత్తగూడెం), కుసపాటి శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్ (50వ డివిజన్ కార్పొరేటర్), దాసరి సారథి తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ సెలవుతో కాకతీయ యూనివర్సిటీ పరీక్షలు వాయిదా




**హన్మకొండ, 26 మే 2026(జై భీమ్ న్యూస్)**

బక్రీద్ పండుగ సందర్భంగా ప్రభుత్వం మే 28వ తేదీకి సెలవు ప్రకటించిన నేపథ్యంలో కాకతీయ యూనివర్సిటీ నిర్వహించాల్సిన పలు పరీక్షలను వాయిదా వేసింది. ఈ మేరకు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల మంగళ వారం ఒక ప్రకటన విడుదల చేశారు. మే 28న జరగాల్సిన డిగ్రీ మొదటి మరియు మూడవ సెమిస్టర్ పరీక్షలను జూన్ 4వ తేదీ (గురువారం)కు మార్చినట్లు తెలిపారు. ముందుగా ఈ పరీక్షలను జూన్ 3న నిర్వహించాలని నిర్ణయించి నప్పటికీ, తాజా మార్పులను విద్యార్థులు గమనించాలని సూచించారు. అదే విధంగా, మే 28న నిర్వహించాల్సిన ఎల్.ఎల్.బి. ఐదేళ్ల కోర్సు నాల్గవ సెమిస్టర్ పరీక్షను జూన్ 5వ తేదీ (శుక్రవారం)కు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలు, పరీక్ష సమయాలలో ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టం చేశారు.

# తెలంగాణలో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ.. ఇద్దరు కీలక నేతల అరెస్ట్





**హైద్రాబాద్, 26 మే 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో సీపీఐ (మావోయిస్టు) పార్టీకి చెందిన ఇద్దరు కీలక నాయకులను అరెస్ట్ చేసినట్లు రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ వెల్లడించారు. బీజేఎస్ఏసీ కార్యదర్శి, సెంట్రల్ కమిటీ సభ్యుడు పసునూరి నరహరి అలియాస్ ‘విశ్వనాథ్’ అలియాస్ ‘సత్య’తో పాటు రాష్ట్ర కమిటీ సభ్యురాలు మేదర దానమ్మ అలియాస్ ‘పూనం’ అలియాస్ ‘జోజా’లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. డీజీపీ వివరాల ప్రకారం, 2026 సంవత్సరంలో తెలంగాణ పోలీసులు చేపట్టిన ఆపరేషన్ల ఫలితంగా ఇప్పటివరకు 264 మంది మావోయిస్టులు లొంగిపోయారు. అలాగే 238 తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 3 మంది కేంద్ర కమిటీ సభ్యులు, 11 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు, 24 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 94 మంది ఏరియా కమిటీ సభ్యులు, 131 మంది పార్టీ సభ్యులు ఉన్నట్లు వెల్లడించారు. ఇటీవల జరిగిన ఆపరేషన్లలో ఏకే-47 రైఫిళ్లు, ఇన్సాస్ రైఫిళ్లు, ఎస్ఎల్ఆర్‌లు, పిస్టల్స్, బీజీఎల్ గన్స్ సహా మొత్తం 334 ఆయుధాలను 2024 నుంచి 2026 మధ్య భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయని తెలిపారు. అరెస్టయిన పసునూరి నరహరి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందినవాడిగా, 1980ల నుంచి మావోయిస్టు ఉద్యమంలో చురుకుగా పనిచేస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఆయన పార్టీ టెక్నికల్ విభాగం, సరఫరా విభాగం, ఆయుధ విభాగాల్లో కీలక బాధ్యతలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. 2017లో కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగిన నరహరి, బీజేఎస్ఏసీ కార్యదర్శిగా కూడా వ్యవహరించినట్లు తెలిపారు. ఇక మేదర దానమ్మ అలియాస్ పూనం గుంటూరు జిల్లాకు చెందినదిగా, బీజేఎస్ఏసీలో రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా పనిచేసిందని పోలీసులు వెల్లడించారు. 2004 నుంచి నక్సల్ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్న ఆమె, దండకారణ్యంతో పాటు జార్ఖండ్ ప్రాంతాల్లో కూడా పనిచేసినట్లు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అరెస్టయిన ఇద్దరి వద్ద నుంచి రూ.40 లక్షల రివార్డు ఉన్నట్లు సమాచారం. కేంద్ర కమిటీ సభ్యుడు నరహరిపై రూ.20 లక్షలు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు దానమ్మపై రూ.20 లక్షల రివార్డు ప్రకటించబడినట్లు వెల్లడించారు. మావోయిస్టులు అమాయక గిరిజనులను తుపాకులు, రాకెట్లు, బూబీ ట్రాప్స్ తయారీలో వినియోగిస్తున్నారని, యువత తప్పుదారి పట్టకుండా జాగ్రత్త పడాలని డీజీపీ సూచించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# పోక్సో కేసు: బండి భగీరథ్‌కు 3 రోజుల పోలీస్ కస్టడీ

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌కు పోక్సో కేసుకు సంబంధించి మల్కాజ్‌గిరి కోర్టు మూడు రోజుల పోలీసు కస్టడీ విధించింది. ఈ మేరకు మంగళవారం ప్రాసిక్యూషన్ పిటిషన్‌పై న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ కోసం భగీరథ్‌ను వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరగా, కోర్టు మూడు రోజులకు మాత్రమే అనుమతించింది. దీంతో ప్రస్తుతం చర్లపల్లి జైలులో ఉన్న భగీరథ్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. అంతకుముందు, పోలీసు కస్టడీ పిటిషన్‌ను భగీరథ్ తరపు న్యాయవాది కరుణాసాగర్ వ్యతిరేకించారు. ఒకవేళ కస్టడీకి అనుమతిస్తే ఉదయం 10 నుంచి సాయంత్రం 5:30 గంటల మధ్య మాత్రమే విచారణ జరపాలని, విచారణకు ముందు, తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరారు. విచారణ సమయంలో బలవంతపు పద్ధతులు వాడకుండా పోలీసులను ఆదేశించాలని కూడా ఆయన విజ్ఞప్తి చేశారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై మే 8న భగీరథ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. బాధితురాలి వాంగ్మూలం తర్వాత పోలీసులు కేసులో కఠినమైన సెక్షన్లను జోడించారు. మే 16న హైకోర్టులో మధ్యంతర రక్షణ లభించకపోవడంతో పోలీసులు భగీరథ్‌ను అరెస్ట్ చేశారు. అయితే, తన కుమారుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడని బండి సంజయ్ తెలిపారు. నేరం అంగీకరించిన తర్వాతే అరెస్ట్ చేశామని పోలీసులు పేర్కొన్నారు. అనంతరం కోర్టు అతనికి 14 రోజుల జ్యూడీషియల్ రిమాండ్ విధించింది.

# బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం



అదనపు కలెక్టర్ ఎన్. రవి




**హన్మకొండ, 26 మే 2026(జై భీమ్ న్యూస్)**

సమాజంలోని అన్ని వర్గాలు సమన్వయంతో పనిచేస్తేనే బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమవుతుందని హనుమకొండ అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. బాలికల విద్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు బాల్య వివాహాల నివారణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "బాల్య వివాహ నిషేధ చట్టం--2006" మరియు "బాల్య వివాహ ముక్త్ భారత్" అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఎన్. రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో మహిళలు ఇంకా అనేక అసమానతలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. బాలికలపై వివక్ష లేకుండా, బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా మత గురువులు ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. బాల్య వివాహ రహిత జిల్లాగా హనుమకొండను తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్ మాట్లాడుతూ బాల్య వివాహ నిషేధ చట్టం--2006 ప్రకారం బాల్య వివాహం శిక్షార్హమైన నేరమని తెలిపారు. ఇటువంటి వివాహాలలో పాల్గొనడం లేదా సహకరించడం వల్ల రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనలో మత పెద్దలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేసి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బాల్య వివాహాల నివారణలో ఈ కమిటీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహ నిర్మూలన కోసం రూపొందించిన గోడపత్రికలను అదనపు కలెక్టర్ ఎన్. రవి ఆవిష్కరించారు. అనంతరం హాజరైన వారితో బాల్య వివాహ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, ఖాజీలు, పాస్టర్లు, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, చైల్డ్‌లైన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 'ఆర్ట్ ఫర్ లైఫ్' విజేతలకు బహుమతులు అందజేసిన టీజీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి





**హైద్రాబాద్, 26 మే 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న "99 డేస్ ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆర్ట్ ఫర్ లైఫ్" సందేశాత్మక కళా పోటీల విజేతలకు టీజీఎస్ఆర్టీసీ వీసీ & ఎండీ వై. నాగిరెడ్డి బహుమతులు అందజేశారు. ఈనెల 9న హైదరాబాద్‌లోని టీజీఎస్ఆర్టీసీ కళాభవన్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన కళాకారులకు మంగళవారం బస్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ కళకు సమాజాన్ని చైతన్యపరిచే అపార శక్తి ఉందన్నారు. రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ వంటి కీలక సామాజిక అంశాలపై కళాకారులు తమ చిత్రాల ద్వారా ప్రజలకు అర్థవంతమైన సందేశాలు అందించారని ప్రశంసించారు. ప్రజల ప్రాణాలను కాపాడే సామాజిక బాధ్యత గల కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు కళాకారులు తమ ప్రతిభతో విశేషంగా సహకరించారని పేర్కొన్నారు. సామాజిక అంశాలపై కళాకారులు స్పందించిన తీరు అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో పెయింటింగ్ విభాగంలో 35 మంది, స్కెచింగ్ విభాగంలో 21 మంది, శిల్పకళ విభాగంలో పలువురు కళాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల విజేతల్లో భారతి కర్ ప్రథమ బహుమతి (రూ.20 వేలు), వుయ్యూరి దుర్గారావు ద్వితీయ బహుమతి (రూ.10 వేలు), సూరం సంపత్ కుమార్ తృతీయ బహుమతి (రూ.5 వేలు) అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈడీలు కుశ్రో షా ఖాన్, సిహెచ్ వెంకన్న, హైదరాబాద్ ఆర్ఎం సుధాపరిమళ, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఏ. శ్రీనివాస కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## మాజీ సీజేఐ బీఆర్ గవాయిని మర్యాదపూర్వకంగా కలిసిన మంద కృష్ణ మాదిగ



**న్యూఢిల్లీ, 26 మే 2026(జై భీమ్ న్యూస్)**

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్) అధినేత, 'పద్మశ్రీ' మంద కృష్ణ మాదిగ భారత సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి దీ. =. +ఖుఝఱ ను మంగళవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గతంలో సుప్రీంకోర్టులో విధులు నిర్వహిస్తున్న సమయంలో జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఎంఆర్పీఎస్ చేపట్టిన వివిధ ఉద్యమ కార్యక్రమాలకు సంబంధించిన ప్రత్యేక నివేదికను మంద కృష్ణ మాదిగ ఆయనకు అందజేశారు. జస్టిస్ గవాయి సుప్రీంకోర్టు బెంచ్‌పై వాదనలు వింటున్న సమయంలో ఓ అగంతకుడు బూటు విసిరి దాడికి పాల్పడిన ఘటనను నిరసిస్తూ, దళిత ఆత్మగౌరవ పరిరక్షణ కోసం జాతీయ స్థాయిలో ఎంఆర్పీఎస్ ఉద్యమాలు నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ ఉద్యమంలో భాగంగా తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు, కలెక్టరేట్ల ముట్టడులు, హైదరాబాద్‌లో భారీ దళిత ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించడంతో పాటు నవంబర్ 17న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా చేపట్టినట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ ఉద్యమ ఘట్టాలను ప్రత్యేక డాక్యుమెంట్ రూపంలో రూపొందించి జస్టిస్ బీఆర్ గవాయికి అందజేసినట్లు ఎంఆర్పీఎస్ వెల్లడించింది. ఈ సందర్భంగా వివిధ సామాజిక అంశాలపై ఇరువురు చర్చించినట్లు తెలిపింది.

## గురుకుల పాఠశాలల్లో ఫాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం




**హన్మకొండ, 26 మే 2026(జై భీమ్ న్యూస్)**

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఫాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురుకుల సొసైటీ కన్వీనర్ రామారావు తెలిపారు. హసన్‌పర్తి, వేలేరు, వంగర, నెక్కొండ, కొడకండ్ల, బండారుపల్లి గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్టుల అధ్యాపక పోస్టుల భర్తీ కోసం జూన్ 3న డెమో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ డెమో ఎర్రగట్టుగుట్ట హసన్‌పర్తి పాఠశాల, కళాశాలలో జరుగుతుందని తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, సంస్కృతం, ఫిజికల్ సైన్స్, బయాలజీ, సోషల్ సైన్సెస్, మాథ్స్ (ఇంటర్), బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్ తదితర సబ్జెక్టులను బోధించేందుకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు కావాలని వెల్లడించారు. అభ్యర్థుల బోధనా అనుభవం, ప్రతిభ, అలాగే ఆయా విద్యాసంస్థల్లో ఉన్న ఖాళీల ఆధారంగా నియామకాలు చేపడతామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీ లోపు తమ దరఖాస్తులను సమీప గురుకుల పాఠశాలలో లేదా ఎర్రగట్టుగుట్ట హసన్‌పర్తి పాఠశాల, కళాశాలలో సమర్పించాలని సూచించారు.

## నిరుద్యోగులకు ఉద్యోగాల పేరుతో టోకరా.. సైబర్ మోసగాళ్ల ముఠా అరెస్ట్



**హైద్రాబాద్, 26 మే 2026(జై భీమ్ న్యూస్)**

నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్ల ముఠాను అంబర్‌పేట్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి మీడియా సమావేశంలో వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం, బెంగళూరుకు చెందిన పేరుగాంచిన సంస్థ పేరును ఉపయోగిస్తూ హైదరాబాద్‌లో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మోసాలకు పాల్పడుతున్న ముఠాపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఫేక్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. ఈ కేసులో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నకిలీ నియామక పత్రాలు ఇచ్చి నిరుద్యోగుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. అరెస్టైన నిందితులపై ఇప్పటికే 11 ఎఫ్ఐఆర్‌లు నమోదై ఉన్నాయని డీసీపీ వెల్లడించారు. ఈ ముఠా మోసాలకు గురైన 40 మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఉద్యోగాల పేరుతో సోషల్ మీడియా, ఫోన్ కాల్స్, నకిలీ వెబ్‌సైట్ల ద్వారా మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలని డీసీపీ రక్షిత కృష్ణమూర్తి సూచించారు. ఉద్యోగాల విషయంలో అధికారిక సంస్థల ద్వారా మాత్రమే ధృవీకరణ చేసుకోవాలని హెచ్చరించారు.

## నాకు ఏపీ పోలీసుల నుంచి ఎలాంటి నోటీసులు రాలేదు: ప్రొఫెసర్ నాగేశ్వర్

**తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్‌ను కలిసిన ప్రొఫెసర్ నాగేశ్వర్**
**నోటీసులు వచ్చినట్టు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై క్లారిటీ**
**వివాదాస్పద వ్యాఖ్యలను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు వెల్లడి**
**సోషల్ మీడియాలో తనపై జరుగుతున్న దుష్ప్రచారంపై చర్యలు కోరిన నాగేశ్వర్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ మంగళవారం తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, తనకు ఆంధ్రప్రదేశ్ పోలీసుల నుంచి ఎలాంటి నోటీసులు అందలేదని స్పష్టం చేశారు. తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం, తప్పుడు సమాచారంపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు ఆయన వివరించారు. ఇటీవల ఒక టీవీ చర్చా కార్యక్రమంలో పవన్ కల్యాణ్, అమిత్ షా, వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించి నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలను తాను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో జనసేన నాయకుల ఫిర్యాదులతో కాకినాడ, మచిలీపట్నం వంటి ప్రాంతాల్లో ఆయనపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ క్రమంలో నాగేశ్వర్‌ను అరెస్ట్ చేసేందుకు ఏపీ పోలీసులు హైదరాబాద్ వెళ్లారంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలను ఏపీ ప్రభుత్వం అప్పుడే ఖండించింది. తాజాగా ప్రొఫెసర్ నాగేశ్వర్ స్వయంగా తనకు నోటీసులు రాలేదని చెప్పడంతో ఈ వదంతులకు తెరపడినట్లయింది.

## బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలి

**కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్**





**కేయూ, 26 మే 2026 (జై భీమ్ న్యూస్)**

బక్రీద్ పండుగను ప్రశాంత, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు పరస్పర సహకారంతో ముందుకు రావాలని కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ కోరారు. పండుగ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణపై కమ్యూనిటీ నాయకులతో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ మతాలు, వర్గాలకు చెందిన నాయకులు పాల్గొని బక్రీద్ పండుగ ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, శాంతిభద్రతలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. పండుగను సోదరభావంతో జరుపుకుని సమాజంలో ఐక్యతను చాటాలని పోలీసులు సూచించారు. ప్రజలు ఎలాంటి అపోహలు, వదంతులను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అసత్య ప్రచారాలను విశ్వసించవద్దని అధికారులు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. పండుగ సందర్భంగా పోలీసు శాఖకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని, ఎలాంటి అనుమానాస్పద ఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కమ్యూనిటీ నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ కమ్యూనిటీల ప్రతినిధులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతలపై వ్యాఖ్యలు..

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ అధికార కాంగ్రెస్ నేతలు చేస్తున్న ధర్నాపై వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (౧+టూ=ఒజ) ఓ అద్దె బస్సు డ్రైవర్‌ను విధుల నుంచి తొలగించింది. ఈ ఘటన జగిత్యాలలో జరగ్గా, ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే, సోమవారం జగిత్యాల నుంచి ధర్మపురికి బస్సు నడుపుతున్న డ్రైవర్ అశోక్, మార్గమధ్యంలో కాంగ్రెస్ నేతలు చేస్తున్న నిరసనను చూశారు. రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశోక్, ధర్నా చేస్తున్న వారిని ఉద్దేశించి "ముందు రైతుల నుంచి పంట ఉత్పత్తులు కొనండి" అని వ్యాఖ్యానించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై కాంగ్రెస్ ధర్మపురి మండల అధ్యక్షుడు సి. లక్ష్మణ్ ఫిర్యాదు చేయడంతో, జగిత్యాల డిపో మేనేజర్ స్పందించారు. డ్రైవర్ అశోక్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ప్రైవేట్ బస్సు యజమాని చుక్క వేణుగోపాల్‌ను ఆదేశిస్తూ లేఖ రాశారు. ఈ ఘటనపై డ్రైవర్ అశోక్ వివరణ ఇచ్చారు. తాను ధర్నాలో పాల్గొన్న తన గ్రామానికి చెందిన వ్యక్తితో మాట్లాడుతున్నానని, డీజిల్, పెట్రోల్ గురించి కాకుండా రైతుల నుంచి పత్తి, మొక్కజొన్న కొనడంపై దృష్టి పెట్టాలని మాత్రమే చెప్పానని స్పష్టం చేశారు. ఏ రాజకీయ పార్టీని గానీ, నాయకుడిని గానీ తాను విమర్శించలేదని తెలిపారు. డ్రైవర్‌ను ఉద్యోగం నుంచి తొలగించడంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ తీవ్రంగా స్పందించింది. మాజీ మంత్రి టి. హరీశ్ రావు, ఎమ్మెల్సీ కవిత ఈ చర్యను ఖండించారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన అశోక్, రైతుల ఆవేదనను తెలియజేశాడని, ప్రశ్నించిన వారి ఉపాధిని లాక్కోవడమేనా ప్రజా ప్రభుత్వమంటే అని కవిత ప్రశ్నించారు.

జై భీమ్ POWER OF PEOPLE

# వంగపహాడ్‌లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. ఆరుగురు అరెస్ట్

**హన్మకొండ జిల్లా/హాసన్ పర్తి, 26 మే 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని వంగపహాడ్ గ్రామంలో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో వ్యక్తి పరారైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, విశ్వసనీయ సమాచారం మేరకు హసన్‌పర్తి ఎస్సై పి. గోవర్ధన్ ఆధ్వర్యంలో సిబ్బంది కరుణాకర్, దేవేందర్, మహేందర్‌లతో కలిసి మంగళవారం వంగపహాడ్ గ్రామంలోని ముస్కు రజనీకాంత్ ఇంటి ముందు ఖాళీ ప్రదేశంలో తనిఖీలు నిర్వహించారు. అక్కడ పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను గుర్తించగా, పోలీసులు చేరుకున్న వెంటనే ఒకరు పరారయ్యారు. మిగతా ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిలో చంద్రకాంత్, తాళ్లపల్లి సురేష్, ముస్కు సురేష్, బోట్ల దివాకర్, ఉడుత రవి, మునుకుంట్ల నాగరాజు ఉన్నారు. పరారైన వ్యక్తిని ముస్కు రజనీకాంత్‌గా పోలీసులు గుర్తించారు. నిందితుల వద్ద నుంచి రూ.8,230 నగదు, 52 పేక ముక్కలు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే పేకాట, గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా, పొగాకు ఉత్పత్తులు, అక్రమ ఇసుక రవాణా, దొంగతనాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఇటువంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని హసన్‌పర్తి పోలీసులు కోరారు.




# లంచాల లేడీ ఎమ్మార్వో ఏసీబీ వలలో..!

భూమి కన్వర్షన్‌కు రూ.30 లక్షల లంచం డిమాండ్



**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

డ్రైవర్ ద్వారా డబ్బులు వసూలు చేస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ శామీర్‌పేట్ తహసీల్దార్ సుచరిత మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా శామీర్‌పేట్ రెవెన్యూ కార్యాలయంలో అవినీతి బాగోతం బట్టబయలైంది. ప్రజలకు సేవ చేయాల్సిన తహసీల్దార్ సుచరిత, భూమి నాలా కన్వర్షన్ ఫైల్ క్లియర్ చేయడానికి ఏకంగా రూ.30 లక్షల లంచం డిమాండ్ చేసి ఏసీబీ అధికారుల వలలో చిక్కారు. ఎకరానికి రూ.1 లక్ష చొప్పున 30 ఎకరాల భూమికి భారీ డీల్ కుదుర్చుకుని, డ్రైవర్ ద్వారా లంచం సొమ్ము వసూలు చేస్తుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో శామీర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో మాటువేసి, లంచం లావాదేవీ జరుగుతున్న సమయంలో దాడి చేశారు. డ్రైవర్ వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకుని, ఎమ్మార్వో సుచరితతో పాటు సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఎమ్మార్వో కార్యాలయం, నివాసాలు, ఇతర అనుమానాస్పద ప్రదేశాల్లో ఏసీబీ బృందాలు సోదాలు చేపట్టాయి. కీలక భూ అనుమతుల ఫైళ్లు, రికార్డులు, ఆస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకుని లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ అవినీతి వ్యవహారంలో మరికొందరు సిబ్బంది ప్రమేయం ఉందా అనే కోణంలో కూడా విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే ఇదే కార్యాలయంలో గతంలో పనిచేసిన ఎమ్మార్వో సత్యనారాయణ లంచం కేసులో పట్టుబడిన ఘటన మరవకముందే, మరోసారి అదే కార్యాలయం అవినీతి కేంద్రంగా మారడం తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రజల పనులను అడ్డుపెట్టి లక్షల రూపాయలు దోచుకునే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# హైదరాబాద్‌లో ఎబోలా వైరస్ భయం..!

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో హైఅలర్ట్..!



**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

ప్రపంచాన్ని వణికిస్తున్న ఎబోలా.. అప్రమత్తమైన కేంద్రం విదేశీ ప్రయాణికులపై కఠిన నిఘా హైదరాబాద్‌లో ఎబోలా వైరస్ భయాందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ఎబోలా వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమై దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులందరికీ థర్మల్ స్క్రీనింగ్, హెల్త్ చెకప్‌లు నిర్వహిస్తున్నారు. ప్రయాణికుల ఆరోగ్య పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తూ జ్వరం, వాంతులు, తీవ్రమైన బలహీనత, తలనొప్పి వంటి లక్షణాలు ఉన్న వారిని ప్రత్యేకంగా గుర్తించి వైద్య పరీక్షలకు పంపిస్తున్నారు. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికుల వివరాలను నమోదు చేస్తూ వారి ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. అనుమానిత లక్షణాలు కనిపిస్తే వెంటనే ఐసోలేషన్‌కు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విమానాశ్రయంలో వైద్య బృందాలు 24 గంటల పాటు అందుబాటులో ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాయి. ప్రజలు అనవసరంగా భయపడాల్సిన అవసరం లేదని, అయితే ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపడుతున్నాయి.



# నకిలీ పత్తి విత్తనాల మాఫియాపై టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం

నలుగురు అరెస్ట్.. 6.7 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు, వాహనం స్వాధీనం

**జై భీమ్ న్యూస్(వికారాబాద్)**



వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా నకిలీ పత్తి విత్తనాల విక్రయాలపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి భారీ మొత్తంలో నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎస్కే అన్వార్ పాషా నేతృత్వంలో జరిగిన రెండు వేర్వేరు దాడుల్లో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, మొత్తం 6.7 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. మొదటి ఘటనలో రావులపల్లి వద్ద తనిఖీలు నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిషేధిత నకిలీ పత్తి విత్తనాలను అక్రమంగా తరలిస్తున్న ఉప్పలపాటి వసంత రావును పట్టుకుని, అతని వద్ద నుంచి 2.5 క్వింటాళ్ల నకిలీ విత్తనాలతో పాటు రవాణాకు ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో నిందితుడు మహేందర్ రెడ్డి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన మరో దాడిలో పునాకాల సురేష్, కళ్యాణ్ వీరేష్, తలారి వేణు అనే ముగ్గురు నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి 4.2 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని తదుపరి దర్యాప్తు కోసం దౌల్తాబాద్ పోలీసులకు అప్పగించారు. ఈ రెండు దాడుల్లో కలిపి మొత్తం 6.7 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం కావడం జిల్లాలో సంచలనంగా మారింది. రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాల వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ స్నేహ మెహ్రా హెచ్చరించారు. నకిలీ విత్తనాల విక్రయాలపై జిల్లా వ్యాప్తంగా నిరంతర నిఘా కొనసాగుతుందని, రైతులు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు. సమర్థవంతంగా ఆపరేషన్ నిర్వహించి నిందితులను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు.

# పశువుల అక్రమ రవాణాపై కఠిన నిఘా

హుజురాబాద్ చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసిన కరీంనగర్ సీపీ గౌష్ ఆలం



**హుజురాబాద్(జై భీమ్ న్యూస్)**

జిల్లాలో పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ అప్రమత్తమైంది. ఇందులో భాగంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మంగళవారం హుజురాబాద్ పరకాల క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టులో నిర్వహిస్తున్న తనిఖీల తీరును పరిశీలించిన సీపీ, అందుబాటులో ఉన్న రికార్డులను తనిఖీ చేసి భద్రతా చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా సరిహద్దుల గుండా పశువుల అక్రమ రవాణా జరగకుండా మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి, పగలు తేడా లేకుండా సంచరించే భారీ కంటైనర్ వాహనాలు, లారీలు మరియు అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. అక్రమ రవాణాకు పాల్పడే వ్యక్తులపై ఎలాంటి ఉపేక్ష లేకుండా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విధుల్లో ఉన్న సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సీపీ గౌష్ ఆలం సూచించారు. అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ ఆకస్మిక తనిఖీలో స్థానిక ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పశువుల అక్రమ రవాణాపై కరీంనగర్ పోలీసుల ప్రత్యేక నిఘా కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.

# చెరువుల కబ్జాలపై హైడ్రా ఉక్కుపాదం

ఒకే రోజు 34 ఎకరాల భూమికి రక్షణ..
రూ.4 వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి కాపాడిన హైడ్రా



**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కఠిన చర్యలు కొనసాగిస్తున్న హైడ్రా (హైడ్రా) మంగళవారం భారీ ఆపరేషన్ నిర్వహించింది. మాధాపూర్‌లో మాయమవుతున్న ఈదులకుంట చెరువును కాపాడటంతో పాటు కోకాపేట కొత్త చెరువులో జరిగిన భారీ ఆక్రమణలను తొలగించి, ఒకే రోజు దాదాపు 34 ఎకరాల భూమిని రక్షించింది. మొత్తం రూ.4 వేల కోట్లకు పైగా విలువైన భూములకు ఫెన్సింగ్ వేసి కబ్జాల బారిన పడకుండా కాపాడింది. మాధాపూర్‌లో మాయం చేసిన ఈదులకుంటకు జీవం శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని 6.05 ఎకరాల ఈదులకుంట చెరువును కొందరు ఆక్రమణదారులు పూర్తిగా మాయం చేసే ప్రయత్నం చేశారు. వరద కాలువలను మళ్లించడం, చెరువు హద్దులను చెరిపేయడం ద్వారా భవన నిర్మాణాలకు సిద్ధమవుతున్న సమయంలో స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల రికార్డులు, గ్రామ పటాలు, అలాగే నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (చీ=ూజ) శాటిలైట్ చిత్రాలను పరిశీలించి అక్కడ చెరువు ఉన్నట్లు నిర్ధారించారు. వెంటనే చెరువు హద్దులు గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అదే ప్రాంతంలో ఉన్న 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా కబ్జాదారుల చెర నుంచి విడిపించి రక్షించారు. దీంతో మాధాపూర్‌లోనే మొత్తం 11.21 ఎకరాల భూమిని హైడ్రా కాపాడింది. ఈ భూముల విలువ సుమారు రూ.1,800 కోట్లుగా అంచనా. ఓవర్‌ల్యాపింగ్ పేరుతో ఆక్రమణల యత్నం కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి మండలాల సరిహద్దుల్లో ఉండటాన్ని ఆసరాగా చేసుకుని కొందరు రియల్ ఎస్టేట్ సంస్థలు చెరువు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించాయి. 14 అంతస్తుల భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకుని, వాస్తవానికి చెరువు ప్రాంతంలోనే సెల్లార్ తవ్వకాలు చేపట్టినట్లు హైడ్రా గుర్తించింది. దీంతో మొత్తం 11.21 ఎకరాల భూమికి రక్షణ కల్పిస్తూ ఫెన్సింగ్ వేసింది. కోకాపేట కొత్త చెరువులో భారీ క్లీన్‌అప్ గండిపేట మండలం కోకాపేట గ్రామంలోని 72 ఎకరాల ఎఫ్‌టీఎల్ పరిధి కలిగిన కొత్త చెరువులో కూడా హైడ్రా భారీ చర్యలు చేపట్టింది. చెరువు మధ్యలో కట్ట నిర్మించి ఎగువ ప్రాంతంలోని 20 ఎకరాలకు పైగా భూమిని కొందరు రియల్టర్లు ఆక్రమించినట్లు గుర్తించింది. ఫెన్సింగ్‌లు, రేకుల ప్రహరీలు నిర్మించి చెరువు భూమిని స్వాధీనం చేసుకున్న ఆక్రమణదారుల నిర్మాణాలను తొలగించింది. గోల్డ్ ఫిష్ విల్లాల సముదాయానికి చెందిన ప్రాంతంలో చెరువు భూమిపై ఏర్పాటు చేసిన బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు, పిల్లల ప్లే ఏరియాలను కూడా తొలగించింది. చెరువు పరిధిలో ఆక్రమించబడిన 1.09 ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడంతో పాటు, ఎగువ భాగంలో ఉన్న 20 ఎకరాలకు పైగా ఆక్రమణలను తొలగించి మొత్తం ప్రాంతానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. హైడ్రా హెచ్చరిక చెరువులు, ఎఫ్‌టీఎల్ ప్రాంతాలు, ప్రభుత్వ భూములపై ఎలాంటి ఆక్రమణలు సహించబోమని హైడ్రా స్పష్టం చేసింది. భవిష్యత్తులో కూడా చెరువులను కబ్జా చేసే ప్రయత్నాలపై మరింత కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరించారు. ఒకే రోజు మాధాపూర్, కోకాపేట ప్రాంతాల్లో కలిపి రూ.4 వేల కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూములు, చెరువులను కాపాడిన హైడ్రా చర్యలు ఆక్రమణదారులకు గట్టి హెచ్చరికగా మారాయి.



# డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే ఆరోగ్యకరమైన భవిష్యత్

**మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తోంది**
**మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కూచనపల్లి ప్రహసీత్**

**హన్మకొండ, 26 మే 2026 (జై భీమ్ న్యూస్)**

సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కూచనపల్లి ప్రహసీత్ హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయి, కొకైన్, హెరాయిన్, సింథటిక్ డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు కేవలం ఆరోగ్యాన్నే కాకుండా వ్యక్తిగత జీవితం, కుటుంబ వ్యవస్థ, సమాజ భవిష్యత్తును కూడా తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. డాక్టర్ ప్రహసీత్ తెలిపిన వివరాల ప్రకారం, మాదక ద్రవ్యాలకు బానిసైన వ్యక్తుల్లో శారీరక, మానసిక, ప్రవర్తనా పరమైన అనేక మార్పులు కనిపిస్తాయని అన్నారు. కళ్లు ఎర్రబడటం, నిద్రమత్తు లేదా అసాధారణ ఉత్సాహం, మాట తడబడటం, ఆకలి, నిద్ర అలవాట్లలో మార్పులు, అకస్మాత్తుగా బరువు తగ్గడం, చేతులు వణకడం, శరీరం నుంచి విచిత్రమైన వాసనలు రావడం వంటి లక్షణాలు సాధారణంగా కనిపిస్తాయని తెలిపారు. అలాగే మాదక ద్రవ్యాల ప్రభావంతో వ్యక్తుల్లో కోపం, చిరాకు, ఆందోళన పెరగడం, కుటుంబ సభ్యులు, స్నేహితుల నుంచి దూరంగా ఉండడం, చదువుపై ఆసక్తి కోల్పోవడం, అనుమానాలు, భయాలు పెరగడం వంటి మానసిక సమస్యలు ఉత్పన్నమవుతాయని వివరించారు. తీవ్రమైన సందర్భాల్లో డిప్రెషన్, హింసాత్మక ప్రవర్తన, నిద్రలేమి, సైకోసిస్ వంటి మానసిక వ్యాధులు కూడా వచ్చే ప్రమాదం ఉందన్నారు. యువత డ్రగ్స్‌కు బానిసైతే వారి ప్రవర్తనలో స్పష్టమైన మార్పులు కనిపిస్తాయని, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లకపోవడం, స్నేహితులను దూరం చేసుకోవడం, ఇంట్లో వస్తువులు అమ్మేయడం, డబ్బు కోసం దొంగతనాలకు పాల్పడడం వంటి పరిస్థితులు ఏర్పడే అవకాశముందని తెలిపారు. కొంతమంది యువకులు కుటుంబ సభ్యుల నుంచి దూరంగా ఉండి ఒంటరితనానికి గురవుతారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో వచ్చే చిన్నచిన్న మార్పులను కూడా గమనించాలని డాక్టర్ ప్రహసీత్ సూచించారు. పిల్లలతో స్నేహపూర్వకంగా మాట్లాడటం, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, చదువు మరియు క్రీడల వైపు దృష్టి మళ్లించడం అవసరమన్నారు. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వినియోగాన్ని పరిమితం చేయడం ద్వారా కూడా కొంతవరకు యువతను మాదక ద్రవ్యాల ప్రభావం నుంచి దూరంగా ఉంచవచ్చని తెలిపారు. అదేవిధంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, ధ్యానం వంటి సానుకూల కార్యకలాపాల్లో యువతను భాగస్వామ్యం చేయాలని సూచించారు. మానసిక సమస్యలు తలెత్తినప్పుడు సైకియాట్రిస్ట్ లేదా కౌన్సెలర్‌ను సంప్రదించడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదన్నారు. డ్రగ్స్ బారిన పడిన వారికి సహాయం అందించేందుకు టెలి-మానస్ మానసిక ఆరోగ్య హెల్ప్‌లైన్ 14416 / 1800-89-14416 అందుబాటులో ఉందని తెలిపారు. అలాగే ఎంజీఎం హాస్పిటల్ డీ-అడిక్షన్ సెంటర్‌లో ఉచిత చికిత్స, కౌన్సెలింగ్ సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. "డ్రగ్స్‌కు 'నో' చెప్పండి. ఆరోగ్యకరమైన మనసు, ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. యువత భవిష్యత్తును కాపాడటం కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం అందరి బాధ్యత" అని డాక్టర్ కూచనపల్లి ప్రహసీత్ పిలుపునిచ్చారు.



# గోదావరి పుష్కరాలకు పకడ్బందీ ఏర్పాట్లు

**దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు**
**భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర కార్యాచరణ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు**



**ములుగు, 26 మే 2026(జై భీమ్ న్యూస్)**

రాబోయే గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మంగళవారం సరస్వతి పుష్కరాల ఆరో రోజు సందర్భంగా కాళేశ్వరం మెగా విశ్రాంతి భవనంలో గోదావరి పరివాహక ప్రాంతాలకు చెందిన భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, మంచిర్యాల జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం సుమారు రూ.1000 కోట్ల నిధులను విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా ఎదురైన లోటుపాట్లను గుర్తించి, వాటిని సరిదిద్దుతూ గోదావరి పుష్కరాల్లో మరింత మెరుగైన ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పారిశుధ్యం, త్రాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, పార్కింగ్, విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు, వీఐపీ, వివిఐపీ పర్యటనలకు అవసరమైన సౌకర్యాలపై జిల్లాల వారీగా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారుల మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, అత్యవసర సేవల అందుబాటు వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సరస్వతి ఆది, అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు కల్పించిన సౌకర్యాలు, చేపట్టిన ఏర్పాట్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో నిజామాబాద్, నిర్మల్ జిల్లాల అదనపు కలెక్టర్లు బుజంగరావు, వెంకటేశ్వర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం ఆర్డీవో రవీందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక కేబుల్ టీవీ ఛానళ్ల సమస్యలు పరిష్కరించాలి

**ఐ అండ్ పీఆర్ కమిషనర్ ముకుంద రెడ్డికి వినతిపత్రం సమర్పించిన తెలంగాణ కేబుల్ టీవీ జేఏసీ**



**హైద్రాబాద్, 26 మే 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో కేబుల్ టీవీ ఛానళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర కేబుల్ టీవీ జేఏసీ ప్రతినిధులు ఐడపీఆర్ కమిషనర్ ముకుంద రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. మంగళవారం ఆయన కార్యాలయంలో జరిగిన సమావేశంలో జేఏసీ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా కేబుల్ టీవీ ఛానల్ నిర్వాహకులు ఎదుర్కొంటున్న ఆర్థిక, సాంకేతిక, పరిపాలనా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని, ప్రభుత్వ ప్రకటనల పంపిణీలో చిన్న మరియు స్థానిక కేబుల్ టీవీ ఛానళ్లకు సమాన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలు, స్థానిక స్థాయిలో ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో కేబుల్ టీవీ ఛానళ్లు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ప్రభుత్వ ప్రకటనలు ప్రధానంగా పెద్ద మీడియా సంస్థలకే పరిమితం కావడం వల్ల స్థానిక మీడియా సంస్థలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేబుల్ టీవీ రంగాన్ని పరిరక్షించేందుకు ప్రత్యేక విధానాలు రూపొందించి స్థానిక మీడియా సంస్థలకు ప్రోత్సాహం అందించాలని జేఏసీ నాయకులు కోరారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు, స్థానిక సమస్యలు, సామాజిక అంశాలపై సమాచారాన్ని వేగంగా చేరవేయడంలో కేబుల్ ఛానళ్లు కీలకంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. జేఏసీ ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఐడపీఆర్ కమిషనర్ ముకుంద రెడ్డి, సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సమన్వయకర్త బి. నరసింహాచారి, కన్వీనర్ డాక్టర్ మహ్మద్ యాసిఫ్ పాషా, పొదిల వెంకట్, కే. కోటేశ్వరరావు, మహేష్ కుమార్ ఉపాధ్యాయ, భరత్, కిరణ్, కిషోర్, బాలు, రవి, బ్రహ్మం, శ్రీనివాస్, బసవరాజు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజాసింగ్‌కు సైబర్ కేటుగాడి ఫేక్ కాల్..


**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకు చాలామందిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను లక్ష్యంగా చేసుకుని కుచ్చుటోపీ పెట్టేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వ ఉన్నతాధికారిగా పరిచయం చేసుకుని ఒక గుర్తు తెలియని వ్యక్తి మోసానికి తెరలేపగా, అప్రమత్తమైన రాజాసింగ్ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఈ ఫేక్ కాల్ ఉదంతంపై ఆయన స్వయంగా ఒక వీడియోను విడుదల చేసి వివరాలు వెల్లడించారు. రాజాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం... నిన్న సాయంత్రం ఆయనకు ఒక గుర్తు తెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో అడిషనల్ సెక్రటరీ దిలీప్ కుమార్‌ని అంటూ పరిచయం చేసుకున్నాడు. "ప్రధాన మంత్రి వికసిత్ భారత్" పథకం కింద తెలంగాణలో ప్రతి నియోజకవర్గానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయని, దీని ద్వారా నియోజకవర్గ యువతకు 50 శాతం సబ్సిడీతో రూ.10 లక్షల రుణాలు ఇస్తామని నమ్మబలికాడు. అన్నింటిలో ముందుండే మీరు ఈ స్కీమ్‌కు ఎందుకు అప్లై చేయలేదని ప్రశ్నిస్తూ.. ఇవాళ రాత్రిలోపే ఆధార్ కార్డ్ వివరాలు పంపాలని ఒత్తిడి చేశాడు. ఈ గడువు విధింపుతో అనుమానం వచ్చిన రాజాసింగ్... వెంటనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీఏకు ఫోన్ చేసి క్రాస్ చెక్ చేసుకున్నారు. ఆర్థిక శాఖలో దిలీప్ కుమార్ అనే అధికారి ఎవరూ లేరని, అసలు అలాంటి స్కీమే లేదని తేలడంతో అది ఫేక్ కాల్ అని నిర్ధారించుకున్నారు. నియోజకవర్గ ప్రగతి కోసమని ఆశపడి ప్రజాప్రతినిధులు ఇలాంటి మోసాల బారిన పడే ప్రమాదం ఉందని, రెండు తెలుగు రాష్ట్రాల ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండాలని రాజాసింగ్ హెచ్చరించారు.

# వృద్ధుల కోసమే ఆరోగ్య సేవలు

**డాక్టర్ అనిత రెడ్డి సేవలు నిజాయితీని కనపరుస్తున్నాయి**
**వృద్ధుల కోసం పాటుపడుతూ సేవ చేయడం ఎంతో గొప్పతనం**
**నిస్వార్థంగా సేవ చేయాలంటే నిజాయితీ ఒకటే ప్రామాణికం**
**సీనియర్ సిటిజనులకు ఫిజియోథెరపీ సేవలను అందించిన డాక్టర్ అనిత రెడ్డి**
**లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవలపై లోతైన వివరాలు సేకరించారు**
**ప్రజాసేవలోని ప్రశాంతత దొరుకుతుంది**
**కేయూఈసీ మెంబర్ డాక్టర్ అనిత రెడ్డి**




**హన్మకొండ జై భీమ్ న్యూస్:-**

సీనియర్ సిటిజనులకు మేలు రకమైన సేవలు అందించాలని కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనిత రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం హన్మకొండ జడ్పీ హాల్ ప్రాంగణంలో సీనియర్ సిటిజనులకు చేయబడుతున్న సేవలను దగ్గరుండి పరీక్షించారు. సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ సేవలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి, ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి, హన్మకొండ లోని జిల్లా పరిషత్తు ఆవరణలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ ను సందర్శించి అందులో వయో వృద్ధులకోసం ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ క్లినిక్, లీగల్ ఎయిడ్ క్లినిక్ ఎలా నడుస్తుందో పరిశీలించి అడిగి తెలిసికున్నారు డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసు అథారిటీ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ కోసం లీగల్ సలహాలు, సూచనలు కోసం సంప్రదించడానికి నియమించిన పారా లీగల్ వాలంటీర్ని ఎన్ని కేసులు నచ్చాయి, సలహాలు, సూచనలకోసం ఎంత మంది వచ్చారు, కౌన్సిలింగ్ కి ఎంత మంది వచ్చారు అన్న వివరాలు అడిగి తెలిసికున్నారు ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ లో అందిస్తున్న ఉచిత ఫిజియోథెరపీ ఉచిత న్యాయ సలహాల కేంద్రాన్ని వినియోగించుకోవాలని అన్నారు, వృద్ధులకు సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు వరం అన్నారు. జిల్లా లోని ట్రిబ్యునల్ కోర్టుకు వస్తున్న కేసులు పని చేస్తూన్న తీరును డాక్టర్ అనితా రెడ్డి వివరించారు , ఇక ముందు కూడా సీనియర్ సిటిజన్స్ కోసం మరింతగా పనిచేయాల్సిన విషయాల గురించి చర్చించు కోవడం జరిగింది, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు ద్వారా వృద్ధులకు మరిన్ని సేవలు అందిద్దాం అని, సీనియర్ సిటిజన్స్ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిద్దాం అని, అన్నీ డిపార్ట్మెంట్స్ కన్వర్జెన్సీతో వయోవృద్ధుల కోసం పని చేద్దాం అని అన్నారు, వేసవిలో వృద్ధులకు రాగి జావ అందిస్తున్నారని వినియోగించు కోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితా రెడ్డి, డాక్టర్ ఉష, పారా లీగల్ వాలంటీర్ ఉపెందర్, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

**పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్**
**వరంగల్ జిల్లాలో కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల పరిశీలన**



**వరంగల్, 26 మే 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఐఏఎస్ మంగళవారం వరంగల్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్ధన్నపేట మండలం కత్రియాల పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అక్కడి నుంచి రైస్ మిల్లులకు ధాన్యం తరలింపు ప్రక్రియను పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో మిగిలిన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయడంతో పాటు ట్యాబ్ ఎంట్రీలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. రైతులకు చెల్లింపులు కూడా సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఖిలా వరంగల్ మండలం తిమ్మాపూర్‌లోని ఎం/ఎస్ సాయి సంతోష్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును సందర్శించి ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. ధాన్యం దిగుమతిని వేగవంతం చేసేందుకు తగిన సంఖ్యలో హమాలీలను నియమించాలని రైస్ మిల్లర్లకు సూచించారు. తదుపరి పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్‌ను వారి చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. అనంతరం అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణితో కలిసి కలెక్టరేట్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి రబీ సీజన్ 2025-26 ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై తగలబడ్డ ఎయిర్ ఇండియా బస్సు

**పెద్ద అంబర్ పేట సమీపంలో ఎయిర్ ఇండియా బస్సులో అకస్మాత్తుగా చెలరేగిన మంటలు**
**చాకచక్యంగా బస్సును రోడ్డు పక్కన ఆపేసిన డ్రైవర్**
**ప్రమాదం కారణంగా రహదారిపై భారీగా నిలిచిన ట్రాఫిక్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ఈరోజు ఒక ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పెద్ద అంబర్‌పేట సమీపంలో ఓఆర్‌ఆర్‌పై ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా సంస్థకు చెందిన ఒక బస్సులో అకస్మాత్తుగా భారీగా మంటలు చెలరేగాయి. బస్సు వేగంగా వెళుతున్న సమయంలో ఒక్కసారిగా వాహనం వెనుక భాగం నుంచి దట్టమైన పొగలు రావడాన్ని లోపల ఉన్న ప్రయాణికులు గమనించారు. ప్రయాణికులు వెంటనే డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో, ఆయన క్షణాల వ్యవధిలో చాకచక్యంగా వ్యవహరించి బస్సును రోడ్డు పక్కన నిలిపివేశాడు. ప్రయాణికులు కిందకు దిగుతుండగానే మంటలు బస్సు మొత్తానికి వేగంగా వ్యాపించాయి. ఓఆర్‌ఆర్‌పై బస్సు విపరీతమైన మంటలతో, భారీగా ఎగసిపడుతున్న పొగలతో తగలబడుతుండటంతో ఆ మార్గంలో వెళుతున్న ఇతర వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదం కారణంగా రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# ‘సూర్యుడు ఎరుగని కొత్త కాంతి’ అంటున్న ఆనంద్ దేవరకొండ

**‘ఎపిక్’ నుంచి మెలోడీ పాట విడుదల**
**ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య సరికొత్త చిత్రం ‘ఎపిక్’**
**ఆదిత్య హాసన్ దర్శకత్వంలో రూపకల్పన**
**‘ప్రియసఖి’ అంటూ సాగే పాట విడుదల**
**కేఎస్ హరిశంకర్ ఆలపించిన బ్యూటిఫుల్ మెలోడీ**
**లిరిక్స్ అందించిన సురేశ్ బానిశెట్టి**



‘సూర్యుడు ఎరుగని కొత్త కాంతి ఇది.. చంద్రుడు చూడని కొత్త వెన్నెలిది’ అంటున్నాడు హీరో ఆనంద్ దేవరకొండ. వైష్ణవీ చైతన్యతో కలిసి అతడు నటిస్తున్న ‘ఎపిక్’ సినిమా నుంచి తాజాగా తొలి పాట విడుదలైంది. ‘బేబీ’ సినిమాతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న ఈ జంట మళ్లీ కనిపించనుండడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ‘చ90ం’ వెబ్ సిరీస్‌తో సెన్సేషన్ క్రియేట్ చేసిన దర్శకుడు ఆదిత్య హాసన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ‘ప్రియసఖి..’ అంటూ సాగే కొత్త మెలోడియస్ సాంగ్‌ను మేకర్స్ మంగళవారం విడుదల చేశారు. ఈ రొమాంటిక్ ట్రాక్‌కు సురేశ్ బానిశెట్టి లిరిక్స్ అందించగా.. ప్రముఖ సింగర్ కేఎస్ హరిశంకర్ తన గాత్రంతో ప్రాణం పోశారు. ‘నా జీవితాన్ని మార్చేశావే బుజ్జి నెమలి.. నాకు స్వర్గాన్ని చూపించావే పూల కడలి’ అంటూ ఆనంద్ దేవరకొండ హీరోయిన్‌ను రిక్వెస్ట్ చేసే లైన్స్ ఈ పాటలో హైలైట్‌గా నిలిచాయి. ఈ సినిమా టీజర్‌ను గతనెల విడుదల చేశారు.

# బన్నీ చేతికి కోట్లు పలికే లగ్జరీ వాచ్.. ధర తెలిస్తే షాకే!

**ఇటీవల క్రికెటర్ వెంకటేశ్ అయ్యర్‌ను కలిసిన అల్లు అర్జున్**
**ఆ సమయంలో బన్నీ చేతికి ఉన్న ఖరీదైన వాచ్‌పై అందరి దృష్టి**
**ఇది పాటెక్ ఫిలిప్ నాటిలస్ బ్రాండ్‌కు చెందిన లగ్జరీ వాచ్**
**మార్కెట్‌లో దీని ధర దాదాపు రూ. 1.82 కోట్లకు పైనే**
**ఐకాన్ స్టార్ స్టైల్‌కు, లైఫ్‌స్టైల్‌కు నిదర్శనమంటున్న ఫ్యాన్స్**



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ స్టైల్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ‘పుష్ప 2’తో అంతర్జాతీయ స్థాయిలో క్రేజ్ సంపాదించుకున్న ఆయన, తాజాగా తన చేతికి పెట్టుకున్న వాచ్‌తో మరోసారి వార్తల్లో నిలిచారు. ఇటీవల టీమిండియా క్రికెటర్ వెంకటేశ్ అయ్యర్, హైదరాబాద్‌లోని అల్లు అర్జున్ నివాసానికి వచ్చి ఆయన్ను కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా, అందరి దృష్టి బన్నీ చేతికి ఉన్న లగ్జరీ వాచ్‌పై పడింది. అల్లు అర్జున్ ధరించిన ఈ వాచ్ ప్రపంచ ప్రఖ్యాత ‘పాటెక్ ఫిలిప్ నాటిలస్’ బ్రాండ్‌కు చెందినది. 18 క్యారెట్ల రోజ్ గోల్డ్‌తో తయారైన ఈ వాచ్ (మోడల్: 5712/1=-001) ఎన్నో ప్రత్యేకతలను కలిగి ఉంది. సన్‌బర్స్ట్ బ్రౌన్ డయల్, మూన్ ఫేజ్, పవర్ రిజర్వ్ ఇండికేటర్ వంటి అత్యాధునిక ఫీచర్లతో ఇది ఆకట్టుకుంటోంది. దీని అందం, ఫీచర్ల మాట అటుంచితే, ధర వింటే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ఈ అల్ట్రా లగ్జరీ వాచ్ అధికారిక రిటైల్ ధర సుమారు రూ. 90 లక్షలు. అయితే, మార్కెట్‌లో దీనికి ఉన్న విపరీతమైన డిమాండ్ కారణంగా ప్రస్తుత మార్కెట్ ధర దాదాపు రూ. 1.82 కోట్లకు పైగా పలుకుతోంది. ఒక్కో సినిమాకు రూ. 200 కోట్లకు పైగా పారితోషికం తీసుకుంటున్న అల్లు అర్జున్.. తన రిచ్ టేస్ట్‌కు, రాయల్ లైఫ్‌స్టైల్‌కు తగ్గట్టుగానే ఈ ఖరీదైన వాచ్‌ను ఎంచుకున్నారని అభిమానులు చర్చించుకుంటున్నారు.

# ‘డాన్ 3’ వివాదం: మౌనమే తన సమాధానమన్న రణ్‌వీర్ సింగ్

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్.. ‘డాన్ 3’ సినిమా వివాదం తీవ్రరూపం దాల్చుతోంది. ఈ ప్రాజెక్ట్ నుంచి ఆయన తప్పుకోవడంపై ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్ (ఖీఔ×జజు) సహాయ నిరాకరణ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో రణ్‌వీర్ సింగ్ టీమ్ తొలిసారిగా స్పందించింది. అయితే, ఆరోపణలను నేరుగా ప్రస్తావించకుండా మౌనంగా, గౌరవప్రదంగా ఉండటమే మేలని తమ వైఖరిని స్పష్టం చేసింది. ఈ విషయంపై రణ్‌వీర్ సింగ్ ప్రతినిధి ఒక ప్రకటన విడుదల చేశారు. “వృత్తిపరమైన చర్చలు, వ్యక్తిగత సమీకరణాలను గౌరవంగా, పరిణతితో, పరస్పర అవగాహనతో నిర్వహించాలని రణ్‌వీర్ బలంగా నమ్ముతారు. ‘డాన్ 3’ విషయంలో జరుగుతున్న పరిణామాలపై ఆయన స్పందించకపోవడానికి కారణం ఇదే. ఊహాగానాలకు ఆజ్యం పోయడం ఆయనకు ఇష్టం లేదు. ఆయన దృష్టి పూర్తిగా తన పని, భవిష్యత్ కమిట్‌మెంట్లపైనే ఉంది” అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. డాన్ ఫ్రాంచైజీకి, అందులో భాగమైన ప్రతి ఒక్కరికీ రణ్‌వీర్ ఎంతో గౌరవం ఇస్తారని, ఆ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నారని తెలిపారు.



# ‘పెద్ది’ ప్రమోషన్స్ ‘దేశీ ప్రిన్సెస్’లా మెరిసిపోయిన జాన్వీ!

బాలీవుడ్ యువ నటి జాన్వీ కపూర్ తన ఫ్యాషన్ సెన్స్‌తో మరోసారి అందరినీ ఆశ్చర్యపరిచారు. బెంగళూరులో తన తాజా చిత్రం ‘పెద్ది’ ప్రమోషన్లలో భాగంగా ఆమె ధరించిన ఒక ప్రత్యేకమైన డ్రెస్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. సాంప్రదాయ బెనారసీ వస్త్రానికి ఆధునిక హంగులు జోడించి రూపొందించిన గౌనులో జాన్వీ అచ్చం ‘దేశీ ప్రిన్సెస్’ (భారతీయ యువరాణి)లా మెరిసిపోయారు. సాధారణంగా బెనారసీ అంటే చీరనే గుర్తుకువస్తుంది. కానీ, జాన్వీ దానికి భిన్నంగా స్ట్రాప్‌లెస్ గౌనును ఎంచుకున్నారు. కార్సెట్ తరహా బాడీస్‌తో, ఫిట్‌గా ఉండే ఈ గౌను ఆమె అందాన్ని మరింత పెంచింది. లేత గులాబీ, మింట్, ఐవరీ వంటి పాస్టెల్ రంగుల కలయిక, బంగారు వర్ణంతో నేసిన పూల డిజైన్లు ఈ డ్రెస్‌కు ప్రత్యేక ఆకర్షణను తెచ్చిపెట్టాయి. దీనికి జతగా చేతులపై కప్పుకున్న షీర్ పాస్టెల్ దుపట్టా రాజసమైన లుక్‌ను ఇచ్చింది. ఈ డ్రెస్‌కు తగ్గట్టుగా ఆక్సీడైజ్ సిల్వర్ జుంకాలు, స్టేట్‌మెంట్ ఇయర్ కఫ్ వంటి మినిమల్ యాక్సెసరీస్ ధరించారు. నుదుట పాపిడితో వేసిన స్లీక్ బన్, గ్లోయీ మేకప్‌తో తన లుక్‌ను పూర్తిచేశారు. ఇటీవలే పర్పుల్ లెహంగాతో వైరల్ అయిన జాన్వీ, ఇప్పుడు ఈ బెనారసీ గౌనుతో సంప్రదాయ వస్త్రకళకు, ఆధునిక ఫ్యాషన్‌కు మధ్య అద్భుతమైన బ్యాలెన్స్ ఎలా సాధించవచ్చో నిరూపించారు.